క్లుప్తంగా

వైభవంగా రాట మహోత్సవం



కల్యాణం రాట ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కల్యాణపు రాట మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ, పండితులు వేదమంత్రాల మధ్య ఉడుపు రాటకు పూజలు చేశారు. కల్యాణం దంపతులు డి. శ్రీనివాసరావు, అనురాధ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపారాధన, అగ్నిప్రతిష్ట, ఆవాహన వంటి క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, సిబ్బంది రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత



పేద మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : బీచ్ రోడ్డులోని బాల వికాస్ ఫౌండేషన్ నిర్వహణలో నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న నిరుపేద మహిళ కొండకు బుధవారం అలయెన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం నార్త్ సభ్యులు కుట్టు మిషన్ బహూకరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గుప్త మాట్లాడుతూ మహిళలు తీరిక సమయంలో ఇటువంటి కోర్సుల్లో శిక్షణ పొంది ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. వచ్చే నెలలో మరి కొంత మంది శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి జి. రామస్వామి, సభ్యులు కె. గాం, డీ, ఎం. వీరభద్రరావు, తీగల సూర్యారావు, ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపనిషత్తులు విలువైన సంపద

సీతంపేట: వేదాలు, ఉపనిషత్తులు భారతీయ సమాజం, పాశ్చాత్య సమాజాల మీద ప్రభావం చూపాయని కవి, రచయిత డాక్టర్ కె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'ఉపనిషత్తులు మన విలువైన సంపదలు' అనే అంశంపై జరిగిన సాహిత్య సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. వేద కాలం పూర్వం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు వేదాలు, ఉపనిషత్తులు భారతీయ, పాశ్చాత్య సమాజాలపై ఏ మేరకు ప్రభావం చూపాయో, వాటి అర్థాలను వివరించారు. అరిస్టాటిల్, వివేకానందుడు నుంచి నేటి ఆధునిక కవులు, తత్వవేత్తల మీద ఉపనిషత్తుల ప్రభావాన్ని తెలియజేశారు. గ్రీకు నుంచి అమెరికా వరకు పాశ్చాత్య కవులు వీటిని ఏ మేరకు ఆదరించారో వివరించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వేదాల్లో నాలుగు భాగాలైన సంహితలు, బ్రహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తుల్లో ఒకటని పేర్కొన్నారు. ఇది పూర్తిగా జ్ఞాన కాండ అని, నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమైనదని, విదేశాల్లో సైతం ఈ విజ్ఞానం ఎందరో నేర్చుకుని లబ్ధి పొందుతున్నారని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ఉపనిషత్తులు మన పూర్వీకులు మనకు అందించిన అమూల్యమైన జ్ఞాన సంపదగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, చింతా ప్రభాకర్, జగదీశ్వరరావు, పీవీఆర్ కుమార్, బి.రాధారాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

అధికారులు స్పందించారు

డెంగ్యూ, మలేరియా వంటి మహమ్మారులతో బాధ పడుతున్న రోగుల రక్షణకు.. ఆ వ్యాధులు సోకుండా తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. కేజీహెచ్‌లోని అపారిశుధ్య వాతావరణం వల్ల ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న నర్సింగ్ విద్యార్థికి డెంగ్యూ సోకింది. దీంతో కేజీహెచ్, జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ అపారిశుధ్య వాతావరణాన్ని తొలగిస్తున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రింగ్, మినీ ఫాగింగ్ వంటి కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపట్టారు.

- డెంగ్యూ, మలేరియాపై యుద్ధప్రాతిపదికన కార్యాచరణ
- రోగుల ఆరోగ్య పరిస్థితిపై డీఎంవో తులసి ఆరా
- పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేసిన జీవీఎంసీ అధికారులు



పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తితో చర్చిస్తున్న అధికారులు

డాబాగార్డెన్స్ : 'కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం' పేరిట 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. బుధవారం ప్రత్యేక కార్యాచరణతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎంతో మందికి ఆరోగ్య సేవలందిస్తున్న కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం రేపుతోంది. ముఖ్యంగా కేజీహెచ్‌కు అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాల, నర్సింగ్ స్కూల్లో అపారిశుధ్యం తాండవిస్తోన్న దృష్ట్యా.. డెంగ్యూ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎందరో రోగులకు వైద్య సేవలందిస్తున్న నర్సింగ్ విద్యార్థికి డెంగ్యూ సోకింది. ఈ విషయాన్ని 'కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం' పేరిట 'సాక్షి' ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలకు శ్రీకారం చుట్టారు. డీఎంవో తులసి ఆస్పత్రిలోని పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తితో భేటీ అయి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో నమోదైన డెంగ్యూ, మలేరియా బాధితుల నుంచి వివరాలు సేకరించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పేషెంట్లకు ఆ వ్యాధులు సోకకుండా ప్రణాళిక సిద్ధం చేశారు. క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం కేజీహెచ్‌లో గల పలు వార్డులను పరిశీలించి చర్యలు చేపట్టడమే కాకుండా వార్డు పరిసర ప్రాంతాల్లో తాండవిస్తోన్న మురుగు, వార్డుల పైభాగంలో గల సింటెక్స్ ట్యాంకుల్లో ఉన్న నీటిని పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిశీలనలో డీఎంవో తులసి, సబ్ యూనిట్ అధికారి బి. శ్రీనివాసాచార్యులు, ఆరోగ్య పర్యవేక్షకుడు మోహన్ దత్తా, హెల్త్ అసిస్టెంట్ రమణ పాల్గొన్నారు.



పేషెంట్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న డీఎంవో తులసి



డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్న రోగులతో మాట్లాడుతున్న డీఎంవో తులసి తదితరులు

వేగంగా నివారణ చర్యలు..

డెంగ్యూ, మలేరియా గురించి తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు ప్రారంభించారు. ఈ వ్యాధులు ప్రబలకుండా అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలు, మూతలు లేని సింటెక్స్ మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. కేజీహెచ్‌లో యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రింగ్, మినీ ఫాగింగ్ వంటి కార్యక్రమాలను బయాలజిస్ట్ సాంబశివరావు, జోన్-4 మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో చేపట్టారు.

మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకుందాం



ర్యాలీలో పాల్గొన్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అప్పలనాయుడు, విద్యార్థులు

అల్లిపురం : మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహారాణిపేట సీఐ పి.శ్రీనివాసరావు అన్నారు. విద్యార్థులతో కలిసి మహారాణిపేట పోలీసులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తుకు బానిసలుగా మారి వారి బంగారు భవిష్యత్‌ను, ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల గురించి ఎలాంటి సమాచారం తెలిసినా 14500 నంబరుకు తెలియజేయాలని కోరారు. తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా జగదాంబ జంక్షన్ నుంచి టర్నల్ చౌల్ట్రీ వరకు మత్తు పదార్థాలు నిర్మూలిద్దాం-యువతను కాపాడుకుందాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ ర్యాలీలో ఎస్.ఐ. అప్పలనాయుడు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

22 నుంచి భజ గోవిందంపై ప్రవచనాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కె.భారతి, ఎం.అనురాధ, ఎన్.శాంతిప్రియ

సీతమ్మధార : నిష్కామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 25 వరకు శంకరాచార్యులు రచించిన భజ గోవిందంపై ప్రవచనాలు నిర్వహించనున్నట్టు సంస్థ కోశాధికారి కె.భారతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆశీలమెట్టలోని సంస్థ కార్యాలయంలో కర పత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు భజనలు, 6 నుంచి 7 గంటల వరకు ప్రవచనాలు జరుగుతాయన్నారు. భజగోవిందం 31 శ్లోకాల్లోని 31 సూక్తులు, జీవన విధానాలను నిష్కామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అరుణజీ తమ ప్రవచనాల్లో తెలుపుతారన్నారు. తమ సంస్థ ద్వారా మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణకు చేయూత, అన్న వితరణ వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధి ఎం.అనురాధ, ఫౌండేషన్ ప్రతినిధి ఎన్.శాంతిప్రియ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను నగర ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

డీజిల్ సబ్సిడీ విడుదలకు వినతి



మంత్రి అచ్చెన్నాయుడిని సత్కరిస్తున్న మర పడవల సంఘం నాయకులు

మహారాణిపేట : పెండింగ్‌లో ఉన్న డీజిల్ సబ్సిడీని విడుదల చేయాలని ఏపీ మర పడవల సంఘం మాజీ అధ్యక్షుడు పి.సి.అప్పారావు కోరారు. బుధవారం శ్రీకాకుళంలో రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని కలిసి మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. రూ.3 కోట్ల 17 లక్షలు వెంటనే విడుదల చేసి మత్స్యకారులను ఆదుకోవాలని, ఇటీవల వేట సాగిస్తూ సముద్రంలో మునిగిపోయిన, కాలిపోయిన బోట్లకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని రూ. 9 నుంచి రూ. 15కు పెంచాలని, ఏడు సంవత్సరాల క్రితం బోట్లకు ఇచ్చిన వీహెచ్‌ఎఫ్ సెట్లు, జీపీఎస్ వంటి వాటిని మార్పు చేయాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు ఎం.మసేను, జి.రామరాజు, ఎం. రాము, ఎస్.దాసు, గంజాన్ తదితరులు ఉన్నారు.

వాల్తేర్ డివిజన్ టెక్నీషియన్లకు ప్రత్యేక సదస్సు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రైలు ఎస్కార్టింగ్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రైలులో ఎలక్ట్రికల్ విధులు నిర్వర్తించే సిబ్బందికి నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ సెమినార్ ఏర్పాటు చేశారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో ఎదురయ్యే లైటింగ్, ఏసీ, తదితర సమస్యలను పరిష్కరించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తుంటారు. ప్రయాణికులకు సుఖవంతమైన, సౌకర్యవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించేందుకు వీరు నిత్యం రైళ్లలో ప్రయాణిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తుంటారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు అత్యంత ప్రమాణాలతో కూడిన సుక్షితమైన సేవలందించడమే తమ ప్రాధాన్యమని తెలియజేశారు. ఆయా విభాగాల మధ్య ఉన్న తాధికారులతో కమ్యూనికేషన్ విధానాలు, టీం వర్క్, సహకారం తదితర అంశాలపై ఈ సందర్భంగా ఆయన వివరించారు.

యోగాతో ప్రశాంత జీవనం

అగనంపూడి: మానసిక ఆందోళనలు, శారీరక రుగ్మతల నుంచి బయటపడడానికి యోగ సాధన ఒక్కటే మార్గమని రాజయోగి బ్రహ్మకుమారి చంద్రశేఖర్ భాయిజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ దివ్యజ్యోతి భవనం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక యోగా శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. మానసిక ఆనందం, పరిపక్వతకు యోగా, ధ్యానం చక్కటి మార్గమన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి మాట్లాడుతూ నిజజీవితంలో మనిషి మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. చదువుకునే విద్యార్థి నుంచి వయో వృద్ధుల వరకు మానసిక ఆందోళనలకు గురవుతున్నారని, వీటన్నింటికీ చక్కని మార్గం యోగసాధన అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ యోగాసనాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్యపరమైన ఉపయోగాలు వివరించారు. ప్రాణాయామం, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి దివ్యజ్యోతి భవనం ఇన్‌చార్జి బీకే రామకోటి తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న పేదలు

డాబాగార్డెన్స్ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం సామాజిక కార్యకర్త లక్ష్మణరావు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని, మానవసేవే మాధవసేవ స్ఫూర్తితో దాతలు ముందుకొచ్చి అన్నదానం చేయటం అభినందనీయమన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర మంత్రికి సత్కారం



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మహారాణిపేట : కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కె.రామ్మోహన్‌నాయుడును గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.జె. గణేష్‌కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎన్. వెంకట్‌గణేష్, విశాఖపట్నం జిల్లా సెక్రటరీ అనిమిరెడ్డి రమణ, వైస్ ప్రెసిడెంట్ బి.వి. అశోక్‌కుమార్, జాయింట్ సెక్రటరీ చింతకాయల బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం



మాట్లాడుతున్న ఔషధాలయ మేనేజర్ దినూప్

డాబాగార్డెన్స్ : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 22 నుంచి 25 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో ఆయన మాట్లాడారు. ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 4 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 0891-2568264, 9133106060 నంబర్లలో సంప్రదించాలన్నారు. చర్మవ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, సోరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్ (ఆందోళన), కీళ్ల వ్యాధులు, నడుంనొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపాన గల తమ కేంద్రంలో నేరుగా వచ్చి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

జూలో మకరందం మొక్కల పెంపకం

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం కొద్ది రోజులుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మారిసన్ హెర్స్‌ఫీల్డ్ ఉద్యోగులు బుధవారం జూలోని సీతాకోక చిలుకల పార్కులో మకరందం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) జి.మంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతాకోక చిలుకలకు ఉపయోగపడే మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ మొక్కలు సీతకోక చిలుకలకు స్థిరమైన ఆవాసాలుగా నిలుస్తాయన్నారు. జీవవైవిధ్యం, సహజ సౌందర్యంతో కూడిన పర్యావరణాన్ని పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మారిసన్ హెర్స్‌ఫీల్డ్ ఉద్యోగులు, జూ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి తిరువీధి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఘాట్‌రోడ్డు మీదుగా సాగుతున్న తిరువీధి ఉత్సవంలో మహిళల కోలాటం



స్వామి వారి తిరువీధి ఉత్సవం

డాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరువీధి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి రథయాత్ర చేపట్టారు. స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన తిరువీధి రథయాత్ర ఘాట్‌రోడ్డు, పూర్ణామార్కెట్, పోలీస్ బ్యారెక్స్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా తిరిగి సత్యనారాయణస్వామి ఆలయం వరకు సాగింది. దారి పొడవునా కోలాటం.. సంకీర్తనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బుద్దా మహాలక్ష్మీ నగేష్ పర్యవేక్షించారు.

నేడు వైదిక సదస్యం..

దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, 9 గంటలకు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం) చేపట్టనున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, బోధకాలు వంటివి రాకుండా కాపాడుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ దోమల వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకసారి ఎయిర్ కూలర్‌లో నీటిని మార్చాలని, మురుగు నీటి నిల్వలపై వారానికి ఒకసారి కిరోసిన్ లేదా ఆయిల్ చల్లాలని తెలిపారు. గంబూషియా చేపలు దోమల కుంటల్లో వదిలితే దోమల ఉత్పత్తి జరగదన్నారు. జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దోమల బెడద నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ దోమల నియంత్రణ మనందరి బాధ్యత కనుక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు నిర్మూలించటంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందే కాకుండా ఎవరి ఇంట్లో వారు శ్రద్ధ వహించి దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు.

సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు కార్యాచరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : దేశంలో 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించిందని, దీనిని అమలు చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం సికిల్ సెల్ అనీమియా డే (రక్తహీనత దినం) సందర్భంగా మారికవలస బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజన ప్రాంతాల్లో దీనిపై అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సికిల్ సెల్ అనీమియా అంటే వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమన్నారు. చాలా సంవత్సరాలు తగినంత మొత్తంలో ఆక్సిజన్ లేకపోవడం వల్ల శరీరంలోని ఏ భాగంలోనైనా కణజాలం నష్టానికి దారి తీస్తుందన్నారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి లక్షణాల్లో ప్రధానంగా రక్త కణాల సంఖ్య తగ్గడం (రక్తహీనత), కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒంటి, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచూ వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, నోడల్ అధికారి అఖిల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.విశ్వనాథ్, హాస్టల్ వార్డెన్, మెడికల్ అధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి



వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్‌తో మహిళలు

డాబాగార్డెన్స్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్. రవిచంద్రన్, ఫస్ట్ లేడీ చిత్ర రవిచంద్రన్ ఆకాంక్షించారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ-201ఏ ఆతిథ్యం మేరకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన విశాఖకు గుడ్‌విల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా సమాజానికి అందిస్తున్న కోట్లాది రూపాయల సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జోరుగా.. హుషారుగా పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ఆట పాటలు.. నృత్యాలతో సందడి చేశారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ గుప్త, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, ప్రాజెక్టు ఛైర్మన్ పి. లక్ష్మీగుప్త, కో ఆర్డినేటర్ బీఎస్‌వీ కమలశ్రీ, బి. ఉమామహేశ్వరరావు, వి. నిర్మల, సీహెచ్ చందన, పి. స్వాతి, సునీతాదేవి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.